క్లుప్తంగా

సిద్దిపేట నుంచి నంగునూరు మండలానికి ఆర్టీసీ సేవలు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట నుంచి నంగునూరు మండలంలోని గ్రామాలకు నూతనంగా సోమవారం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కలి ్పంచనున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేంద ర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30గంటలకు ఘన్‌పూర్ నుంచి గట్ల మల్యాల మోడల్ స్కూల్, సాయంత్రం 6.15గంటలకు గట్లమల్యాల మోడల్ స్కూల్ నుంచి ఘన్‌పూర్‌కు అదే విధంగా ఉదయం 8.30గంటలకు మగ్దుంపూర్ నుంచి సిద్దిపే టకు, సాయంత్రం 6.10గంటలకు సిద్దిపేట నుంచి మగ్దుంపూర్, ఖాతా వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని డీఎం కోరారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ కవిత

బెజ్జంకి(సిద్దిపేట): ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమష్టిగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బెజ్జంకి జెడ్పీటీసీ సభ్యురాలు కనగండ్ల కవిత సూచించారు. మం డలంలోని ముత్తన్నపేటలో దాతలు అందిం చిన సుమారు 30లక్షల విరాళాలతో నిర్మించ నున్న హనుమాన్ ఆలయానికి ఆదివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కనగండ్ల రాజేశం, ఎంపీటీసీ కొలిపాక రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహి పాల్‌రెడ్డి, భూదాతలు మంద కిష్టమ్మ వీరారెడ్డి దంపతులు, సురేందర్‌రెడ్డి, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనాథలకు అండగా నిలుద్దాం


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న అరుణారెడ్డి, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అనాథలకు అందరం అండగా నిలుద్దామని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణారెడ్డి అన్నారు. పట్టణంలోని నైట్ షెల్టర్ (అనాథ వృద్ధుల ఆశ్రమం) లార్డు స్వచ్ఛంద సంస్థకు ఆదివారం రూ.30వేల విలువ గల ఆర్‌ఓ వాటర్ ఫిల్టర్, 3 బెంచీలు, 6 కుర్చీలు, ఫ్యాన్ అందజేశారు. అనంతరం నైట్ షెల్టర్‌లో అన్న దాన కార్యక్రమం నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాడిపల్లి భాస్కర్‌రెడ్డి, వర్షినిరెడ్డి, అభినవ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాందేడ్ సభకు తరలిన చేర్యాల నాయకులు

చేర్యాల(సిద్దిపేట): బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యం లో మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం నిర్వహించిన భారీ బహిరంగ సభకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య ఆధ్వర్యంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. సభకు తరలిన వారిలో సర్పం చ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల ఎల్లా రెడ్డి, యూత్ నాలుగు మండలాల ఇన్‌చార్జి శివగారి అంజయ్య, మల్లన్న ఆలయ ధర్మకర్త కొంగరి గిరిధర్, యూత్ నాయకుడు ఏర్పుల మహేశ్ ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న నాయకులు

కోహెడ(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యా లను ప్రజలకు వివరించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జ సత్యనారాయణరావు కార్యకర్త లకు సూచించారు. ఆదివారం మండల కేం ద్రంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమా వేశానికి హాజరై ఆయన మాట్లాడారు. గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును ప్రజలకు తెలియజేయాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బొమ్మ శ్రీరాం చక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేణుగోపాల్‌రావు, విజయపా ల్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంక టేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందిందని బీజేపీ జిల్లా నాయకులు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని బీజేపీ బూత్ లెవల్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం దత్తత గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లలో అవినీతి జరుగుతున్నా పట్టిం చుకోవడం లేదని ఆరోపించారు. కొండపో చమ్మ ప్రాజెక్ట్‌ను పర్యటన కేంద్రంగా ఏర్పాటు చేస్తామని మరిచారన్నారు. సమావేశంలో మం డలాధ్యక్షుడు రమేశ్, నాయకులు తిరుపతిరెడ్డి, కుషాల్‌సింగ్, కరుణాకర్ పాల్గొన్నారు.

అన్నదాత వరిగోస

- విద్యుత్ కోతలతో అవస్థలు
- 12గంటల పాటు త్రీఫేజ్ రాక ఇక్కట్లు
- ఎల్‌ఆర్, ఎల్‌సీ పేరుతో గంటలకొద్ది కోతలు
- ఎండుతున్న పంటలు


చౌడుతండాలో విద్యుత్ కోత కారణంగా ఎండిన పొలం

అక్కన్నపేట(హుస్నాబాద్): పుడమి తల్లిని నమ్ముకొని పంటలు సాగు చేస్తున్న అన్నదాతలు కరెంట్ కోతలతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తు న్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. 12గంటల పాటే సరఫరా అవుతుం డగా.. అది త్రీఫేజ్ విద్యుత్ సక్రమంగా అందించ కపోవడంతో పంటలు ఎండుతున్నాయి.అక్కన్నపేట మండలంలో వారం, పదిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రివేళ కరెంట్..

విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యంలో కోత విధి స్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ ఇచ్చే 12గంటల విద్యుత్ త్రీఫేస్ రాకపోవడంతో బోర్లు నడవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా సరఫరా కూడా రాత్రివేళ ఇస్తుండ డంతో కాపలా కాయాల్సి వస్తోందని, ఆ సమయం లోనూ తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండడంతో పొలానికి నీరు పారడం లేదని వాపోతున్నారు. పం టలు చేతికందే దశలో ఉన్నాయని, ట్రాన్స్‌కో అధికా రులు స్పందించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా కోతలు

ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అవుతుందని చెబుతున్నా.. స్థానిక సిబ్బంది ఎల్‌సీ(లోకల్ కటింగ్), ఎల్‌ఆర్ (లైన్ రిపేర్)పేరుతో గంటల కొద్ది కోత విధిస్తు న్నారు. ఒక్కోసారి త్రీఫేజ్ విద్యుత్ ఏ సమయంలో ఉంటుందో తెలియడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నష్టపోకముందే అధికా రులు స్పందించి విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని రైతులు విన్నవిస్తున్నారు.

పంటకు నీరందడం లేదు

విద్యుత్ కోతలతో అనేక ఇబ్బందులకు గురవుతు న్నాం. అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలకు సాగు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. సాగు చేస్తున్న భూమిలో సగం కూడా నీరందడం లేదు. దీనికి తోడు రాత్రి కరెంట్ ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఉన్నతా ధికారులు స్పందించాలి.

–భూక్య జగన్‌నాయక్, చౌడుతండా

రాత్రి, పగలు ఇస్తున్నాం

రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజా మున 5 గంటల వరకు త్రీఫేజ్ కరెంట్ ఉంటుంది. అలాగే పగలు కూడా ఇస్తున్నాం. విద్యుత్ కోతలు లేకుండా తగు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా చేస్తు న్నాం.

–శివనారాయణ, విద్యుత్ ఏఈ

అభివృద్ధి పనులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మండలంలోని చీకోడ్ గ్రామంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ భవనం ప్రారంభించడం తో పాటుగా రూ.కోటి 20లక్షల నిధులతో చేపట్ట నున్న అంబేడ్కర్, రెడ్డి సంఘం, రజక, విశ్వబ్ర హ్మణ, మజీద్ కమిటీ, ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవ నాల నిర్మాణానికి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం శిలాజీనగర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లా డుతూ.. జూటా మాటలు, మాయమాటలతో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు ప్రజలకు చేసిం దేమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తే సమయానికి వచ్చి కత్తెర పట్టి కత్తిరించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత, సర్పంచ్ తౌడ శ్రీని వాస్, ఎంపీటీసీ రాంరెడ్డి, వైస్ ఎంపీపీ అస్క రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ పద్మయ్య, కో–ఆప్షన్ సభ్యుడు షాదుల్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, కృష్ణ, ప్రభాకర్, సర్పంచ్‌లు, కుల సంఘాల నాయ కులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి


చెల్లాపూర్‌లో కరపత్రాలు పంచుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని రేకుల కుంట మల్లన్నస్వామి ఆలయంలో మల్లన్న స్వామికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనం తరం దుబ్బాక మండలంలోని చెల్లాపూర్, రాజక్క పేట, దుంపలపల్లి, బల్వంతాపూర్, అప్పన్నపల్లి, హసన్ మీరాపూర్, పెద్దగుండవెళ్లి, పద్మనాభునిపల్లి గ్రామాల్లో హాత్ సే హాత్ జోడోయాత్ర కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆ ర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి పాలన గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియంత పాలన సాగి స్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతా రన్నారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సైనికు డిలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాం గ్రెస్ నాయకులు అందె రాజిరెడ్డి, కమలాకర్, సంజీ వరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సిం లు, తదితరులున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


శివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్ల పల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి సన్నిధిలో నిర్వ హించే మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆల యాన్ని దశవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. భక్తులకు రవాణా సౌకర్యంలో ఇబ్బందులు కలుగొద్దని పందిల్ల నుం చి ఆరెపల్లి వరకు తారు రోడ్డుకు మరమ్మతులు చేప ట్టామని చెప్పారు. దేవదాయశాఖ అధికారులతో మాట్లాడి రాజగోపురం నిర్మాణం, భక్తుల కోసం మండప నిర్మాణాలకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. భక్తులకు ఎలాంటి సమ స్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఈఓను ఆదే శించారు. కార్యక్రమంలో ఎంపీపీ లకావత్ మానస, కోహెడ ఎంపీపీ కీర్తి, ఎంపీటీసీ పిట్టల శ్రావణి, కానుగుల మోహన్, మార్క అనిల్‌గౌడ్, అర్చకులు సతీశ్‌శర్మ తదితరులు ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకరూరల్: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. దుబ్బాక మండలం పద్మశాలి గడ్డలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... గ్రామాల అభివృద్ధికి కోసం పార్టీల కతీంగా పాటు పడతానన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం పాటుపడతా నన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళి ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


గణపతి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని బం దారంలో నూతనంగా నిర్మించిన మహంకాళి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా ప్రధాన గడప ద్వారాన్ని రెడ్డి సం ఘం ఆధ్వర్యంలో ఆదివారం బ్రాహ్మణోత్త ముల మంత్రోచ్ఛారణలతో ప్రతిష్ఠించారు. 1000 ఏళ్ల కిందట నిర్మించిన ఆలయం శిథిలా వస్థలోకి చేరుకోవడంతో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఆలయాన్ని నిర్మిం చుకున్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, హోమం నిర్వహించారు.

మల్లికార్జునస్వామి ఆలయంలో మాఘపౌర్ణమి వేడుకలు

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని మర్పడ్గలో గల విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో మాఘపౌర్ణమి వేడుకలను వైభ వంగా నిర్వహించారు. ఉదయం 10గంట లకు గణపతి పూజ, స్వస్తిహవచనం, గోపూజ కార్యక్రమాలను నిర్వహించారు. సంతాన మల్లికార్జున స్వామికి, విజయదుర్గా మాతకు విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నవావరణ హవనం, సుహా సినులు సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. తీర్థప్రసాద, అన్న ప్రసాద వితరణ చేశారు.

'బడ్జెట్‌లో బీసీలకు న్యాయం చేయాలి'

హుస్నాబాద్: దళితబంధు, గిరిజనబంధు మాదిరిగా బీసీబంధు పథకాన్ని ప్రకటిం చాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశాడు. పట్టణంలో ఆదివారం ఆయన విలేక రుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 17శాతం రిజర్వేషన్లకు కుదించచడంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎం పీపీలు, జెడ్పీ చైర్మన్ల సంఖ్య తగ్గిందన్నారు. ఈ బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం చేస్తే సహించబోమని హెచ్చరించాడు. కార్యక్ర మంలో సంఘ నాయకులు వరయోగుల అనంతస్వామి, చొక్కాచారి, రాంప్రసాద్, రాజేందర్, శంకరాచారి పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'హాథ్ సే హాథ్' యాత్ర


తొగుటలో పాదయాత్రలో చిన్నారులతో శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పేదలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర ఆదివారం 5వ రోజుకు చేరింది. మండల కేంద్రంలో ఇంటింటి పాదయాత్రలో ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలు సుకున్నారు. పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కింద న్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు తప్పా బీఆర్‌ఎస్ చేసింది శూన్యమన్నారు. మహిళా, అంగన్‌వాడీ, కుల సంఘాల భవనాలు వందల సంఖ్యలో అసంపూర్తిగా నిలిచిపోయాయ న్నారు. వీటిలో ఒక్క భవనం పూర్తిచేయని దుస్థి తిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ప్రజలకు మంచి రోజులు రావాలంటే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నియో జకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సిటిజన్ క్లబ్ ఎన్నికలు


ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో సుపరిచిత మైన సిటిజన్ క్లబ్ ఎన్నికలు ఆదివారం రసవత్తరం గా కొనసాగాయి. 1964లో ఏర్పాటైన క్లబ్ నూతన పాలకవర్గం ఎన్నికల్లో భాగంగా ఆదివారం పోలింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగింది. మొత్తం 852 మంది ఓటర్లకు గాను 590 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, చిన్నకో డూర్ ఎంపీపీ మాణిక్యరెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాంతో పాటు పట్టణ ప్రజాప్రతి నిధులు, ప్రముఖులు ఓటు వేశారు. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. అర్ధరాత్రి వరకు కౌంటింగ్ కొనసాగే అవకాశం ఉంది.

'అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్‌ఎస్'

తొగుట(దుబ్బాక): వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ దుబ్బాక నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ చారి అన్నారు. మం డలంలోని పెద్ద మాసాన్‌పల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మండల కార్యవర్గం, శక్తిస్థాయి సమా వేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 10 నుంచి 25 వరకు నిర్వహించే శక్తి కేం ద్రాల స్థాయి స్ట్రీట్ కార్నర్ సమావేశాలపై చర్చిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ ఎస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను మభ్యపెడుతోం దని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, తుక్కాపూర్ సర్పంచ్ చంద్రం, బీజేవై ఎం మాజీ జిల్లా అధ్యక్షుడు విభీషన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్


మాట్లాడుతున్న అరవింద్

చిన్నకోడూరు(సిద్దిపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని, బహుళ జాతి విద్యా సంస్థలతో కుమ్మక్కై విదేశీ విద్యాసంస్థ లను ఆహ్వానిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్ ఆరోపించారు. ఆదివారం చిన్నకోడూ రులోని ఎస్సీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి నిధులు కేటాయించా లని, విద్యా ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలన్నారు. సం క్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు అం దించే మెస్, కాస్మోటిక్స్ చార్జీలకు నిధులు పెంచేలా బడ్జెట్ రూపకల్పన చేయాలన్నారు. వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు మెడికల్ క్యాంపులు నిర్వ హించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శ్రీనివాస్, రాహుల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సుగుణ

కొండపాక(గజ్వేల్): అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ర్యాగల్ల సుగుణ అన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లి గ్రామం లో రజక సంఘం భవన నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరవడంతో ఆదివారం సర్పంచ్ బడేకోలు లావణ్యతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సం దర్భంగా ఎంపీపీ సుగుణ మాట్లాడుతూ.. గ్రామాల్లో కుల సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం పని చేస్తూ ఆదరణ పెంచుకుంటుంద న్నారు. అన్ని కులాల వారి భవన నిర్మాణాలకు త్వరితగతిన నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాలిగామ నర్సింగ రావు, పీఆర్ఏఈ తిరుపతిరెడ్డి, నాయకులు యాదంరావు, నరేందర్, కిరణ్‌గౌడ్, బాలయ్య, రం జిత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


దిష్టికుంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆది వారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున మేలుకొలుపు, దిష్టికుంభంతో అర్చకులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పన చేశారు. మండపంలో అన్నంను రాశిగా పోసి దిష్టికుంభంను ఏర్పాటు చేసి అర్చకులు పూజలు చేశారు. ఉదయం 10 గంటలకు వేదమూర్తులైన పార్నంది శంకరశర్మ వైదిక నిర్వహణలో అర్చకులు పార్నంది ఆంజనేయ శర్మ ఏకాదశ రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు రామలింగేశ్వరస్వా మితో పాటు మల్లికార్జునస్వామి, పద్మనాభస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో రామలింగేశ్వర స్వామి నామస్మరణతో క్షేత్రం మార్మోగింది. రామ లింగేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో పార్నంది విశ్వనాథశర్మ, ఆలయ చైర్మన్ లింగారెడ్డి పర్యవేక్షించారు. అదేవిధంగా గుట్ట కింద భాగంలో ఉన్న పోచమ్మకు భక్తులు బోనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం స్వామివారికి బండ్ల సేవ, రాత్రికి దేవుడి సేవలు, అమ్మాపురం కళాకారు లతో నాటక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమం లో సర్పంచ్ కూకట్ల బాల్‌రాజుయాదవ్, అర్చకులు శివప్ప, భద్రప్ప, డైరెక్టర్లు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నంగునూరు(సిద్దిపేట): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బెదురు కుమారస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం మగ్దుం పూర్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి శక్తి కేంద్ర ఇన్‌చార్జిలను నియమించారు. ఈ సందర్భం గా కుమారస్వామి మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాల మేరకు శక్తి కేంద్రాల వారీగా కర్నర్ మీటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇన్‌చార్జిలకు సభలు, సమావేశాల నిర్వహణ బాధ్యతలు అప్పగించి జన సమీకరణ, పార్టీ అభివృద్ధి బాధ్యతలు అప్పగించా మన్నారు. ఈ సందర్భంగా నంగునూరు మండల ప్రధాన కార్యదర్శిగా బండి సతీశ్‌కుమార్, మగ్దుం పూర్ బూత్ అధ్యక్షుడిగా కొలుపుల అశోక్‌కు నియా మకపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్‌గా ఉపేందర్‌రావు, జిల్లా కార్య దర్శి వాసర యాదమల్లు, కృష్ణమాచారి, శ్రీనివాస్, రాజలింగం, తిరుపతి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సురేశ్‌గౌడ్

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన బీజేపీ జనగామ నియోజకవర్గ కార్యాల యాన్ని ఆదివారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేశ్‌గౌడ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో జన గామ నియోజకవర్గంలో బీజేపీ గెలవడం ఖాయమని, బండి సంజయ్ నేతృత్వంలో తెలంగా ణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందాసు, శశిధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మి, కరీముద్దీన్, సిద్ధారెడ్డి, సురేం దర్, పాండు, భాస్కర్‌రెడ్డి, షాదుల్లా, బాల్‌రాజు, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భానుచందర్, శివయ్య, వెంకటేశం, అంజయ్య, మనోజ్, ప్రవీణ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


చిన్నకోడూరు(సిద్దిపేట): హోమం నిర్వహిస్తున్న దృశ్యం


మద్దూరు(హుస్నాబాద్): అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీ పూర్ శివారులోని గుట్టల్లో వెలసిన ఉగ్ర నర్సింహ స్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం గణప తిపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, హోమం, గుట్ట చుట్టూ బండ్లు తిరుగుట, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ నిర్వాహకులు మీసం నాగరాజుతో పాటు యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమ్మక్క–సారలమ్మలకు పూజలు

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని కూటిగల్‌లో సమ్మక్క–సారలమ్మలకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించు కున్నారు. సర్పంచ్ దొమ్మ బాలమణిబాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు డప్పు చప్పుళ్లు, శివస త్తుల పూనకాల మధ్య బంగారం, ఎదురుకోళ్లతో ప్రత్యేక పూజలు చేసి సమ్మక్క–సారలమ్మల మినీ జాతరను ప్రారంభించారు. అమ్మవార్లను దర్శిం చుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావ డంతో గ్రామంలో సందడి నెలకొంది. కార్యక్రమం లో వీఆర్ఏ భూపాల్, జాతర చైర్మన్ రాజారాం, వైస్ చైర్మన్ రూపేశ్, బీఆర్‌ఎస్ నాయకులు ధరావత్ సురేశ్‌నాయక్, గట్టయ్య పాల్గొన్నారు.